క్లుప్తంగా

మొక్కలు నాటి సంరక్షించాలి



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థుల తల్లులు

నెల్లిమర్ల రూరల్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఇన్చార్జ్ హెచ్ఎమ్ ప్రసాద్ సూచించారు. మండలంలోని కొండగుంపాం ఉన్నత పాఠశాలలో 'మా కే నామ్ పేడ్' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లులచే మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న వనస్టాప్ సెంటర్ సిబ్బంది అనిత

విజయనగరం ఫోర్ట్: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వన్స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ టి. అనిత అన్నారు. పట్టణంలోని కేఎల్ పురం లక్ష్మీగణపతి బాలికల కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా చైల్డ్లైన్ 1098 నంబర్కు సమాచారం అందించాలని సూచించారు. గృహహింస, వరకట్న వేధింపులకు గురైన మహిళలు ట్రోల్ ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే న్యాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పారాలీగల్ వర్కర్ బి. నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి

- ఆర్జేడీ విజయ్భాస్కర్



సమావేశంలో మాట్లాడుతన్న ఆర్జేడీ విజయభాస్కర్

భోగాపురం: విద్యావ్యవస్థ బలోపేతానికి ప్రతి ఉపాధ్యాయుడూ కృషి చేయాలని ఆర్జేడీ బి. విజయ్భాస్కర్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగంలో ప్రత్యేక బోధనా పద్ధతులను ఉపయోగించి వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలని సూచించారు. బోధనోపకరణాలు ఉపయోగించి బోధన చేపట్టాలన్నారు. ముందుగా సిబ్బంది సమయపాలన, క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. అనంతరం మండలంలోని ముంజేరు ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను, పాఠశాల రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటి ఎడ్యుకేషనల్ ఆఫీసర్ కేవీ రమణ, ఎంఈఓలు ఎం. రమణమూర్తి, బి. చంద్రమౌళి, ప్రిన్సిపాల్ పార్వతి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కాత్యాయనీదేవిగా రాజరాజేశ్వరి



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేవుపల్లిలో వెలసిన రాజరాజేశ్వరీదేవి అమ్మవారు శుక్రవారం కాత్యాయనీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు దూసి శ్రీధర్శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు.

సన్ఫ్లవర్ సాగు లాభదాయకం

చీపురుపల్లి రూరల్: సన్ఫ్లవర్ పంటసాగు రైతుకు లాభదాయకంగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి సీహెచ్.రఘునాథ్ అన్నారు. మండలంలోని పేరిపి గ్రామంలో సన్ఫ్లవర్ 1012 విత్తన రకాన్ని గ్రామానికి చెందిన రైతు పొలంలో నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పంట 90 నుంచి 95 రోజుల్లో చేతికి అందుతుందని, హెక్టార్కు 1500 నుంచి 1800 కిలోల దిగుబడి వస్తుందని తెలిపారు. రైతులు విత్తనాలు వేసే ముందు 14 గంటలు విత్తనాన్ని నీటిలో నానబెట్టి వరుస వరుసకి 45 సెంటీమీటర్లు, మొక్కమొక్కకి మధ్య 25 సెంటీమీటర్లు దూరం ఉండేలా విత్తుకోవాలని సూచించారు.

భూసార పరీక్షలతో
అధిక దిగుబడులు



చౌడువాడలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది (ఫైల్)

- నియోజకవర్గంలో 2,560 మట్టి నమూనాల సేకరణే లక్ష్యం
- భూమిలో పోషక విలువల సమతుల్యతకే పరీక్షలు
- సద్వినియోగం చేసుకుంటే రైతులకు మరింత మేలు



ప్యాకింగ్ చేయడానికి సిద్ధం చేస్తున్న మట్టి నమూనాలు (ఫైల్)

మండలం	రైతుసేవా కేంద్రాలు	మట్టి నమూనాలు
పూసపాటిరేగ	19	760
నెల్లిమర్ల	18	720
డెంకాడ	16	640
భోగాపురం	11	440

పూసపాటిరేగ: భూసార పరీక్షలతో భూమిలో పోషక విలుల సమతుల్యత సాధించవచ్చు. ఈ దిశగా రైతులకు మేలు చేసేందుకు వ్యవసాయశాఖ భూసార పరీక్షలకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం నెల్లిమర్ల నియోజకవర్గంలో 2,560 మట్టి నమూనాలు సేకరించే పనిలో వ్యవసాయశాఖ సిబ్బంది నిమగ్నమయ్యారు. సేకరించిన నమూనాలను సాయిల్టెస్ట్ సెంటర్కు పంపనున్నారు. భూసార పరీక్షల ఫలితాల ద్వారా సారం కోల్పోయిన భూమిలో పోషక విలువల సమతుల్యత సాధించి అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది. ప్రస్తుతం నెల్లిమర్ల నియోజకవర్గంలో 64 రైతుసేవా కేంద్రాలలో 2,560 వరకు మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకుంటే ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

భూసార పరీక్షలు ఇలా...

నీటి సౌకర్యం ఉన్నచోట ఏడాదికి ఒకసారి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలి. ప్రతి మూడు సీజన్లకు ఒకసారి భూసార పరీక్షలు చేసుకున్నట్లయితే మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉంది. అదే మెట్టు భూముల్లో అయితే మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేయాల్సి ఉంటుంది. రైతులు పంటలు సాగుచేసిన ప్రతిసారీ భూముల్లో నత్రజని, భాస్వరం వినియోగం ఎక్కువగా ఉంటుంది. భూసార పరీక్షల ద్వారా వీటి శాతం ఎంతమేరకు తగ్గిందో తెలుసుకోవచ్చు. తద్వారా పంటలు సాగు చేసే ముందు తగినంత మేరకు వీటిని పిచికారీ చేస్తే భూసారం మళ్లీ యథాస్థితికి చేరుకుని మంచి దిగుబడులు సాధించవచ్చు.

ఎనిమిది చోట్ల మట్టి సేకరణ..

భూసార పరీక్షలలో భాగంగా ఒక పొలంలో మట్టి నమూనాలను సేకరిస్తారు. అవి వర్షాధార భూమిలైనా, నీటి సౌకర్యం ఉన్న భూములైనా మట్టి సేకరణ విధానం ఒకేలా ఉంటుంది. పొలం నలుమూలలా ఎనిమిది చోట్ల వి ఆకారంలో తవ్వి ఒక చోట అరకిలో చొప్పున మట్టి నమూనాలు సేకరిస్తారు. తర్వాత మట్టి మొత్తాన్ని ఒకచోట కలిపి భూసార పరీక్షలు చేస్తారు. తద్వారా భూమిలో ఏయే పోషకాలు ఎంతమేర ఉన్నాయి.. ఏయే పోషకాల అవసరం ఉందో తెలుసుకోవచ్చు.

21 రోజుల్లో ఫలితం

భూసార పరీక్షల నిమిత్తం సేకరించిన మట్టి నమూనాల ఫలితాలను 21 రోజుల తర్వాత ప్రకటిస్తారు. రైతుసేవా కేంద్రం సిబ్బంది భూసార పరీక్షల ఫలితాన్ని రైతులకు తెలియజేస్తారు. దీంతో సదరు రైతు పొలంలో నత్రజని, పొటాష్, భాస్వరం, కాల్షియం, ఐరన్తో పాటు ఉదకజనిక సూచిక, సేంద్రియ కర్బనం వంటివి భూమిలో ఎంతమేర ఉన్నాయో తెలుస్తుంది. భూసారాన్ని పెంపొందించేందుకు ఎలాంటి పోషక విలువలు కలిగిన ఎరువులు వాడాలో వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తారు.

భూసారం పెంచుకోవచ్చు..

> భూసార పరీక్షలతో పొలాలను సారవంతంగా తయారు చేసుకోవచ్చు. భూసార పరీక్షల ఫలితాల కార్డులు రైతులకు అందజేస్తాం. గుల్లబారిపోయిన భూములను సారవంతంగా మార్చుకుని అధిక దిగుబడులు సాధించవచ్చు. గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల సిబ్బంది పొలాల్లో మట్టి నమూనాలను సేకరిస్తున్నారు.
>
> – కె. నీలిమ, మండల వ్యవసాయాధికారి, పూసపాటిరేగ

టోల్గేట్ను రద్దు చేయాలంటూ వినతి



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

విజయనగరం పూల్బాగ్: విజయనగరం – విశాఖపట్నం రహదారి మధ్య జొన్నాడ వద్ద ఏర్పాటు చేయనున్న టోల్గేట్ను రద్దు చేయాలని కోరుతూ జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అధితి గజపతిరాజుకు సీపీఎం, లోక్సత్తా నాయకులు శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జి. శ్రీనివాస్, ఎ. జగన్మోహనరావు మాట్లాడుతూ.. ఎలాంటి రోడ్డు నిర్మాణం చేపట్టకుండా టోల్గేట్ ఏర్పాటు చేయడం సరికాదన్నారు. లోక్సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ, జెడ్పీ సమావేశంలో చర్చించి టోల్గేట్ ఎత్తివేయాలని కోరారు. మౌలిక సదుపాయాలు కల్పించకుండా టోల్ ఎలా వసూలు చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె. సురేష్, బి. రమణ, ఆర్. ఆనంద్, వి.లక్ష్మి, బి. సుధారాణి, హరీష్, సింహాచలం, త్రినాథ్, ధాత్రాజు రాజారావు, పీఎల్ఎన్ రాజు, మమ్ముల తిరుపతిరావు, గంటా వీర్రాజు, దుక్క శేఖర్, రామచంద్రరాజు, ప్రకాష్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వయసు పెంచాలి




మంత్రికి సమస్యలు చెప్పుకుంటున్న ఉద్యోగులు

- మంత్రి కొండపల్లికి విభిన్న ప్రతిభావంతుల సహాయ సంస్థ ఉద్యోగుల వినతి

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థలో పనిచేస్తున్న అన్ని కేడర్ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వయసు పెంచాలని ఆ సంస్థ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘ ప్రతినిధులు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ను శుక్రవారం పట్టణంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు ఇచ్చినట్లే ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పొడిగించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంస్థ ఉద్యోగుల సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్.ఈశ్వరరావు, ప్రతినిధులు ఎస్వీ వర్మ, వి.మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫైడితల్లికి లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చనలో పైడితల్లి అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

జిల్లా కేంద్రంలోని చదురుగుడిలో కొలువైన పైడితల్లికి శుక్రవారం లక్ష పుష్పార్చన కనులపండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఎ.సి ప్రసాదరావు ఏర్పాట్లు చేశారు. – విజయనగరం టౌన్/ సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పూడి హరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మపురి, వసంత విహార్, నోబుల్ నగర్, ఎస్వీఎస్ నగర్, బియ్యాలపేట, కమాలనగర్, కేవీఆర్ గురాన సాదురావు ఎస్టేట్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

డెంకాడలో..

డెంకాడ: విద్యుత్ లైన్లు, సబ్స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా మండల కేంద్రంలోని విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఏఈ పి.అప్పలస్వామినాయుడు తెలిపారు. డెంకాడ, గుణుపూరు, గుణుపూరుపేట, ముంగినాపల్లి, డి.కొల్లాం, కె.కొల్లాం, చొల్లంగిపేట, ద్వారాపురెడ్డిపాలెం, నగరపుపేట, పోతయ్యపాలెం, పెదతాడివాడ, పినతాడివాడ, గొడిపాలెం, వెదుళ్లవలస, దొడ్డిబాడువ, చందకపేట, మహంతిపేట, లెంకపేట, సింగవరం, నాతవలస గ్రామాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మరమ్మతుల నేపథ్యంలో..

భోగాపురం: మండలంలోని అమటాం రావివలస, గూడెపువలస, దల్లిపేట, రెడ్డికంచేరు, బైరెడ్డిపాలెం, ముడగపేట, చాకివలస, ఉప్పాడపేట, రెల్లిపేట, నారుపేట, సవరవిల్లి, రావాడ, కవులవాడ, తూడెం గ్రామాల పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఆయా గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ జి.సురేష్బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల అనంతరం సరఫరా పునరుద్ధరిస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

హెల్మెట్ తప్పనిసరి

దత్తిరాజేరు: ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్, లైసెన్స్, సీబుక్ తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్.భూర్జవలస ఎస్సై లక్ష్మీప్రసన్నకుమార్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత నిబంధనలపై యువతకు అవగాహన కల్పించారు. అతివేగంతో వాహనాలు నడపడం వల్ల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు.

అనుమతుల్లేని ప్లాట్లు కొనుగోలు చేయొద్దు..



పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

పూసపాటిరేగ: మండలంలోని కొల్లాయివలస పరిధిలో సర్వే నంబర్లు 96పి, 97పి, 98పిలో ప్రభుత్వం అనుమతుల్లేకుండా శ్రీభూమి డెవలపర్స్ లే అవుట్ వేసిందని, అందులో ప్లాట్లు ఎవ్వరూ కొనుగోలు చేయవద్దని మండల పంచాయతీ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కొల్లాయివలస పంచాయతీ, వీఎంఆర్డీఏ అనుమతుల్లేకుండా ప్లాట్లు వేశారని చెప్పారు. ఈ విషయంలో కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బుద్ధ, కల్కి అవతారాల్లో జగన్నాథుడు



కోళ్లబజారులో బుద్ధ, కల్కి అవతారాల్లో కొలువైన జగన్నాథుడు

విజయనగరం టౌన్: రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా స్థానిక కోళ్లబజారులో కొలువైన జగన్నాథుడు బుద్ధ, కల్కి అవతారాల్లో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు నగేషాచార్యులు విశిష్ట పూజలు నిర్వహించారు. అదే విధంగా ఉల్లివీధి కాళ్లనాయుడు రామమందిరంలో కొలువైన జగన్నాథుడు కూడా ప్రత్యేక అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ సాయి సంపత్ ఆచార్యులు, రామాచార్యులు స్వామివారికి విశేష పూజలు చేపట్టారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



దుర్గా దీక్షిత



చంద్రకేశ్వరి



అభిమన్యు



యోగేశ్వరరావు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బొప్పడాం ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపియ్యారు. దుర్గా దీక్షిత, చంద్రకేశ్వరి నూజువీడు క్యాంపస్కు.. అభిమన్యు శ్రీకాకుళం క్యాంపస్కు.. యోగేశ్వరరావు ఒంగోలు క్యాంపస్కు ఎంపికైనట్లు హెచ్ఎం నగేష్కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానం రేపు



ప్రతిభా పురస్కారాల ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న సమాఖ్య గౌరవాధ్యక్షుడు డాక్టర్ డీవీ.శ్రీకాంత్, తదితరులు

విజయనగరం టౌన్: బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 14న నిర్వహించనున్న ప్రతిభా పురస్కార మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశామని సమాఖ్య గౌరవాధ్యక్షుడు డాక్టర్ డీవీ శ్రీకాంత్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక గాయత్రీ భవన్లో కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వానప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జ్ఞానసరస్వతీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రతిభా పురస్కారమహోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన 500 మంది పేద విద్యార్థులకు ఈ ఏడాది సహాయం అందజేయనున్నామన్నారు. దాతల సహకారంతో విద్యా దత్తత కార్యక్రమాన్ని 12 ఏళ్లగా కొనసాగిస్తున్నామని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీతం ప్రిన్సిపాల్ డాక్టర్ ద్వివేదుల రామ్మూర్తి, మరో అతిథిగా కోర్బా కేంద్రియ విద్యాలయం రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.నాగమణి, ఆత్మీయ అతిథిగా సీనియర్ చార్టెడ్ అకౌంటెంట్ ఈశ్వరరామ సోమయాజులు హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి వీవీ నరసింహ, సత్యకామ్, బీహెచ్కే బాబూజీ, భోగరాజు సూర్యలక్ష్మి, జీఎస్.ప్రకాశరావు, చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

మొండి బకాయిల వసూళ్లలో పురోగతి

- సకాలంలో పన్ను బకాయిలు చెల్లించకుంటే కుళాయి కనెక్షన్ కట్
- కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు

విజయనగరం: నీటి పన్నుకు సంబంధించి మొండి బకాయిల వసూళ్లలో పురోగతి కనబరచడం అభినందనీయమని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో వార్డు సచివాలయ ఎమినిటీస్, అడ్మిన్ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతవారం నీటిపన్ను మొండి బకాయిల వసూలే లక్ష్యంగా సచివాలయాల వారీగా కార్యదర్శులకు లక్ష్యాలు నిర్దేశించామన్నారు. కార్యదర్శులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడంతో ఆశించిన దానికన్నా ఎక్కువ మేర వసూలైందన్నారు. ఇదే ఒరవడితో సచివాలయాల వారీగా నీటిపన్ను వసూళ్లను మరింత వేగవంతం చేయాలని సూచించారు. 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి గాను నీటిపన్ను వసూలు రూ. 6,18,19,841 లక్ష్యం కాగా, ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 60,46,854 రూపాయలు వసూలు చేసినట్లు తెలిపారు. సకాలంలో పన్ను చెల్లించకుండా కుళాయి కనెక్షన్లు నిలిపివేస్తామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ఈఈ కె. శ్రీనివాసరావు, డీఈ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

- నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి

నెల్లిమర్ల: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫొటో, సైన్స్ ఎగ్జిబిషన్లను తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రధానమంత్రి మోదీ సూచనల మేరకు అన్ని పాఠశాలలు, ప్రభుత్వ ప్రాంగణాల్లో విరివిగా మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల, కళాశాల విద్యార్థులు సాధించిన ప్రగతిని ప్రిన్సిపాల్ రమామోహిని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధర్మరాజు, ఎంపీడీఓ రామారావు, ఎంఈఓలు ఉపాధ్యాయుల సూర్యనారాయణమూర్తి, ఈవు విజయ్కుమార్, నగర పంచాయతీ చైర్పర్సన్ బంగారు సరోజిని, కౌన్సిలర్లు అవనాపు సత్యనారాయణ, నరవ రామలక్ష్మి, నాయకులు లెంక అప్పలనాయుడు, యడ్ల గోవిందరావు, రవ్వా నాని, అట్టాడ శ్రీధర్, బైరెడ్డి కల్యాణ్, ఎంఎం నాయుడు, చింతాడ రాజేష్, అంబళ్ల అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.